క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

విద్యారణ్యపురి: ఈనెల 29, 30వ తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అవసరమైన అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాలని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి, పాలిత శ్రీహరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, పోలింగ్ ముగిసిన తరువాత సిబ్బంది తమ సొంత ప్రాంతాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ వేసే అవకాశం కల్పించాలని, డిసెంబర్ 1న సెలవు మంజూరు చేయాలని తెలిపారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మంగళవారం కలిసి విన్నవించినట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

కాజీపేట: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రచారం ముగిసిన నేపథ్యంలో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, మద్యం పంపిణీ చేసినా, బెదిరింపులకు పాల్పడినా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని అన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పోలీస్ నిఘా ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీల కార్యకర్తలతో పాటు అనుచరులు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేలా శాఖపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

సంచార జాతులకు అన్యాయం




నయీంనగర్: రాష్ట్రంలో సంచార జాతులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం గౌరవ అధ్యక్షుడు వల్లపు సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సంచార జాతులకు 5శాతం రిజర్వేషన్ కల్పించి బీసీలకు ఉన్న 23శాతం ఉన్న రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచినట్లు తెలిపారు. ఈక్రమంలో కాంగ్రెస్‌కే తెలంగాణ సంచార జాతుల పూర్తి మద్దతు ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో బొంత ఐలయ్య, బొంత మురళి, శివరాత్రి ప్రదీప్, బొంత శివ, బొంత కొమ్మాలు, ఆలకుల్ల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు న్యాయవాదుల మద్దతు



నయీంనగర్: వరంగల్ జిల్లా న్యాయవాదుల లీగల్ సెల్ మద్దతు కాంగ్రెస్ పార్టీకి రక్షణగా ఉంటుందని లీగల్ సెల్ చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో న్యాయవాదుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పోపా రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థికి గెలుపునకు వరంగల్ బార్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధులు నల్ల మహాత్మ, పిల్లి కార్తీక్, వేముల రమేష్, యుగేందర్, లాడే రమేష్, రాజు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో బీజేపీ బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న శ్రీధర్, తదితరులు

మడికొండ: ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు మంగళవారం బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కొండేటి శ్రీధర్ మడికొండలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మడికొండలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద మొదలైన ర్యాలీ మడికొండ అంబేద్కర్ విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు వరకు సాగింది. కార్యక్రమంలో నాయకులు పానగోటి వెంకట్‌రావు, కందుకూరి బాలరాజు, గడ్డం మహేందర్, ముత్తోజు సురేష్, వస్కుల మౌళి, బైరపాక వెంకటేష్, ఆకుల శ్రీకాంత్, ధారావత్ సునీల్, ఎలగొండ శివ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే



ఆర్ట్స్ కళాశాలలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



ఖిలా వరంగల్: శివనగర్‌లోని హాస్టల్‌లో..



నిట్‌లో నివాళులర్పిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

విద్యారణ్యపురి: సామాజిక రుగ్మతలపై పోరాడిన, సమాజంలోని అట్టడుగు వర్గాల హక్కుల కోసం పాటుపడిన మొట్టమొదటి సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ కరుణాకర్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు బడుగు, బలహీన వర్గాలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తిరుణహరి శేషు, రాజశేఖర్, పుల్లా రమేష్, ప్రవీణ్, లింగయ్య, చింతం ప్రవీణ్, జితేందర్ పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖిలా వరంగల్: విద్య అందరికి అందాలని, సమాజంలోని కుల వివక్ష నిర్మూలనకు పోరాడిన సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే ఆశయాల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ సూచించారు. పూలే వర్ధంతి సందర్భంగా శివనగర్‌లోని



హసన్‌పర్తి: ముచ్చర్లలో..

ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శరత్ మాట్లాడుతూ పూలే 1827, ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మాలి తోటలు సాగు చేసే కుటుంబంలో జన్మించారని తెలిపారు. సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థ ద్వారా జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టేందుకు పూలే కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు శివసాగర్, రాజు, మహేష్, శ్రీధర్, శ్రీకాంత్, హరీష్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

కాజీపేట అర్బన్: అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నిట్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్ అన్నారు. వర్ధంతిని పురస్కరించుకొని నిట్‌లో పూలే చిత్రపటానికి ఉద్యోగులు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక అసమానతపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఆకుల కుమార్, దయాకర్, బొట్టు శ్రీను, సాంబయ్య, ఆర్.శ్రీనివాస్, సురేష్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

హసన్‌పర్తి: సామాజిక వేత్త మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని ఒకటవ డివిజన్ ముచ్చర్లలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీధర్, రాజేష్, చిర్ర శ్రవణ్, కర్ర సాంబరెడ్డి, రాజు, అమీర్, నాగవెల్లి శ్రవణ్ పాల్గొన్నారు.

దానకర్ణుడు, వర్తక శ్రేష్టి చందా కాంతయ్య



పండ్లు పంపిణీ చేస్తున్న కళాశాల కమిటీ సభ్యులు

దేశాయిపేట: తన జీవిత సర్వస్వాన్ని సమాజ సేవకు అంకితం చేసిన అపర దానకర్ణుడు, వర్తక శ్రేష్టి చందా కాంతయ్య అని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శశిధర్ అన్నారు. చందా కాంతయ్య జయంతి సందర్భంగా సీకేఎం ప్రభుత్వ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగం కేడెట్లతో పాటు విద్యార్థులు మంగళవారం రక్తదానం చేశారు. సీకేఎం గవర్నమెంట్ ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేంద్రశాస్త్రి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాల్లో చేయూతనందించడం ద్వారా ఎంతోమంది హృదయాల్లో కాంతయ్య కొలువై ఉన్నారని కీర్తించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, లైబ్రేరియన్ అనిల్, డాక్టర్ మోహన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, భాష, సుమలత, అరుణ, మాధవి, వసుధ, ఉదయ, రవి, రమేష్, ధర్మయ్య, పూర్ణ, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ పీ.సతీష్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో 'ఎస్‌వీఎస్' ప్రతిభ



హసన్‌పర్తి: నగరంలోని జేఎన్ఎస్‌లో ఇటీవల జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో ఎస్‌వీఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు రన్నర్‌గా నిలవగా, 400మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్ రావు తెలిపారు. షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, లాంగ్, హైజంప్‌ల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు అభినందించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



విద్యారణ్యపురి: మాట్లాడుతున్న దామెర నర్సయ్య



హసన్‌పర్తి: ప్రచారం చేస్తున్న సీనియర్ సిటిజన్లు

విద్యారణ్యపురి: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రజల చేతిలో ఉన్న వజ్రాయుధం లాంటిదని, దాన్ని ఓటర్లందరూ వినియోగించుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో 'అమ్మ.. నాన్న ఇవ్వండి హామీ' అనే కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటు విలువ గురించి వివరించి వారు తప్పనిసరిగా ఓటు వేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి విద్యారణ్యపురి, గోపాలపురం అధ్యక్షుడు దామోదర్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, ఉపాధ్యక్షులు నర్సయ్య, కొంగారపు రాజేందర్, కొండేటి మల్లారెడ్డి, కానుగల రాజమౌళి, హైస్కూల్ హెచ్ఎం జగన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

హసన్‌పర్తి: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి ఉపాధ్యక్షుడు ఎన్.నర్సయ్య పిలుపునిచ్చారు. నగరంలోని 53, 55, 56వ డివిజన్లల్లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు ఆయుధం లాంటిదని వివరించారు. ప్రతిఓటరూ బాధ్యతాయుతంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నిజాయితీగల, బాధ్యతగల, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు రాజేందర్, సాంబయ్య, రాజమౌళి, సిరంగి సంపత్, మల్‌హార్‌రావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యారణ్యపురి: ఎయిడ్స్ నివారణకు విద్యార్థులు కృషి చేయాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు కోరారు. డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభను కనబరిచిన వారికి డిసెంబర్ 1న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు చందులాల్, శ్రీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని ప్రచారం



కాజీపేట: ప్రచారం చేస్తున్న నాయకులు

కాజీపేట: దాస్యం వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కార్యకర్తలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్ ఆధ్వర్యంలో 62వ డివిజన్‌లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని వినయ్‌భాస్కర్ ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రజలు మరోసారి ఆయను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, కల్పలత సూపర్ బజార్ డైరెక్టర్ అయ్యాల దానం, మారగోని విజేందర్, సుంచు రఘురాం, పాము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బీసీల మద్దతు

నయీంనగర్: దాస్యం వినయ్‌భాస్కర్‌కు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీసీలంతా బీసీ అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు ఆనందం, మాడిశెట్టి అరుంధతి, చిర్ర రాజుగౌడ్, కరుణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటా..

- స్వచ్ఛందంగా ఓటు వేసేలా పనిచేస్తా
- కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: తనను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే, రెండోసారి తాను ఓటు అడగనని, ఓటర్లే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేసేలా నిబద్ధతతో పని చేస్తానని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని విశాల్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో ఉన్న స్పందన చూస్తే 50వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు. ఎమ్మెల్యేగా దాస్యం వినయ్‌భాస్కర్ 10ఏళ్లలో చేయని అభివృద్ధిని తాను 5ఏళ్లలో చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, నాయకులు రాజేశ్వర్‌రావు, జగన్మోహన్ రెడ్డి, మహాత్మ, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, రమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

పార్టీ హామీలు, నడవడికే గెలిపిస్తాయి

ఓటు ఒక వజ్రాయుధమని, ఓటు హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆయన 'సాక్షి'తో మంగళవారం మాట్లాడుతూ పార్టీ ఆరు గ్యారంటీలు, తన సత్ప్రవర్తనతో కూడిన నడవడిక తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తాయని తెలిపారు. 37 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశానని వివరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు.

అందరికి అందుబాటులో ఉంటా..

- బీజేపీ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్: ఎమ్మెల్యే గెలిపిస్తే వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. దేశాయిపేట రోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ తాను 2009లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నాటి నుంచి నేటి వరకు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని వివరించారు. తూర్పు ముఖ చిత్రం మార్చేందుకు తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వరంగల్‌లో



సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

భారీ పరిశ్రమల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పద్మశాలి సంఘం నాయకులు కుసుమ సతీష్, శ్యాం, కనుకుంట్ల రంజిత్, అకిన వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి
- బీఆర్ఎస్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. విద్య, వైద్యానికి తాను అధిక ప్రాధాన్యం ఇచ్చానన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచానని గుర్తుచేశారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ



ప్రజలతో ముఖాముఖి, అపార్ట్‌మెంట్ దర్శన్, అడ్డా ములాఖత్ కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి నేరుగా వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశానని వివరించారు. నగరాన్ని ఐటీ పరిశ్రమలు తీసుకురావడంతో పాటు, పర్యాటక రంగంగా, ఆధ్యాత్మిక రంగంగా, ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేశానన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంపై మరోసారి గులాబీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని వినయ్‌భాస్కర్ కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



కరీమాబాద్ : లక్ష్మీపురంలో ప్రచారం చేస్తున్న అరూరి రమేశ్



పర్వతగిరి : గులాబీ కండువాలు కప్పుతున్న అరూరి

- కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మరు
- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేశ్

కరీమాబాద్: వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 43వ డివిజన్ లక్ష్మీపురంలో మంగళవారం పర్యటించారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటు, బీజేపీ వస్తే మోటార్లకు మీటర్లు పెడతారని విమర్శించారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఉదయ్‌కిరణ్, కార్పొరేటర్ అరుణ, స్పందన్, షణ్ముఖరెడ్డి, గౌస్, అర్చన, షకీల్, జోగిరెడ్డి, కుమారస్వామి, క్రాంతి, శివ, బాబు, శేఖర్, రాకేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ గ్రామ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు గిద్దె దయాకర్‌రెడ్డి, దమ్మిశెట్టి రాజు, గడ్డం వెంకన్న మంగళవారం వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో



ఏనుమాములలో ప్రచారం చేస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి రమేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ బోయినపల్లి యుగేంధర్‌రావు, మండల యువత అధ్యక్షుడు గూడ నరేందర్‌వర్మ, గ్రామ మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దమిశెట్టి నర్సింగం, మాజీ ఉపసర్పంచ్ సతీష్‌రావు, అశోక్, సుధాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరూరిని భారీ మెజార్టీతో గెలిపించాలి

వర్ధన్నపేట: బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గౌడ సంఘాల జేఏసీ కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గౌడ సంఘాల జేఏసీ సమావేశం పూజారి రఘు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చిర్ర రాజు మాట్లాడుతూ అరూరి రమేష్‌కు గౌడ సంఘాల జేఏసీ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో చెట్టు పన్ను పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, అమ్మగోని స్వామిరాములు, శ్రీనివాస్, రాజమణి, శ్రీనివాస్, అనిల్, శ్రీధర్, రాజు, వేణు పాల్గొన్నారు.


పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన అరూరి

వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్లను అభివృద్ధి చేసి, పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కే దక్కుతుందని వరంగల్ జిల్లా సమన్వయ రైతు కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్ అన్నారు. ప్రచారంలో భాగంగా చివరి రోజు మంగళవారం 14వ డివిజన్ ఏనుమాముల, బాలాజీ నగర్‌లలో సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 116/117 బూత్‌ల పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. రాజపోశాలు, పత్రి సుభాష్, గంధం గోవిందు, పస్తం యాదగిరి, హితేష్, యాకస్వామి, కిశోర్, సంపత్, పరమేశ్వర్, రమేష్, కుమారస్వామి, సాంబయ్య, రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భారీ ర్యాలీ

హసన్‌పర్తి : అరూరి రమేశ్ గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మండలంలోని ముచ్చర్లలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అరూరిని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర ప్రమోద్, శ్రీధర్, పాల్, ప్రతాప్, రాకేష్, రాజు, సాంబశివారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి స్కూల్‌లో ఫ్రెంచ్ ఫెయిర్



కరీమాబాద్: వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం 'ఫ్రెంచ్' ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచంలో ఎంతో ఆదరణ ఉన్న ఫ్రెంచ్ భాషను సైతం ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు బోధన జరుగుతుండడంతో విద్యార్థులు మాతృభాషతోపాటు ఫ్రెంచ్ భాషలో కూడా తమ భావాలను వ్యక్తం చేస్తారు. ఈక్రమంలోనే విద్యార్థులు ఫ్రాన్స్ దేశ సంస్కృతి, అక్కడి చారిత్రక కట్టడాలపై ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అలాగే, విద్యార్థుల తరగతుల ఆధారంగా ఫ్రెంచ్ భాషలో క్విజ్, ఉపన్యాస, వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ వరుణ్, ప్రిన్సిపాల్ స్వర్ణ, ఉషశ్రీ, మాన్య తదితరులు పాల్గొన్నారు.